## దవాఖాన నుంచి ఎమ్మెల్యే 'పల్లా' డిశ్చార్జి



ఎమ్మెల్యే పల్లాకు పరీక్షలు నిర్వహించిన వైద్య బృందం

చేర్యాల, జూన్ 21: ఇటీవల గాయపడి సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి శనివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. యశోద ఆసుపత్రిలోని డా.ఉదయ్‌కృష్ణ ఆధ్వర్యంలో వైద్యబృందం ఎమ్మెల్యే పల్లాకు పరీక్షలు నిర్వహించి త్వరగా కోలుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించి దవాఖాన నుంచి డిశ్చార్జి చేశారు. మరో వారం రోజులు వైద్యుల సలహాలు సూచనలు తప్పక పాటించాలని సూచించారు.

## బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ నాయకుల చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

జగదేవపూర్ జూన్ 21: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి శనివారం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ప్రతాప్‌రెడ్డి వారికి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గతంలో బీఆర్ఎస్‌లో ఉన్న నర్సింహారెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లో చేరారు. కాగా తిరిగి నేడు సొంతగూటికి చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలేశంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ యాదవ రెడ్డి, గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కిరణ్‌గౌడ్, జగదేవపూర్ గ్రామ అధ్యక్షుడు నాగరాజు, ధర్మారం మాజీ సర్పంచ్ రాజు, ఐలేని తదితరులు ఉన్నారు.

## యువత సమాజానికి ఆదర్శంగా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మూర్తి

హుస్నాబాద్‌టౌన్, జూన్ 21: నేటి యువత నైతిక విలువలు పెంచుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆర్డీవో రామ్మూర్తి అన్నారు. జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర ముగింపు సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ యువత చదువుతూ జ్ఞానాన్ని పెంపొందించుకుని దేశాభివృద్ధిలో ముఖ్యపాత్ర పోషించాలన్నారు. ఏసీపీ సదానందం మాట్లాడుతూ.. రోజురోజుకు విస్తరిస్తున్న డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్స్, గేమ్స్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, జేఏసీ కన్వీనర్ కవ్వ లక్ష్మారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, జేఏసీ కోఆర్డినేటర్ సారయ్య, రవీందర్,ప్రకాశ్, కుమారస్వామి, జగదీశ్, భిక్షపతి, శ్రీలత పాల్గొన్నారు.

## ఢిల్లీ సెమినార్‌లో ప్రభుత్వ ఉపాధ్యాయుడు



సెమినార్ నిర్వాహకులతో రవీందర్

చేర్యాల, జూన్ 21: మండలంలోని ఆకునూరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఫిజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న ఆర్.రవీందర్ ఢిల్లీలో ఈనెల 24, 25వ తేదీలలో నిర్వహించే సెమినార్‌లో కీ మెంటర్‌గా ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి 10మంది టీచర్లు ఎంపికకాగా, అందులో ఆకునూరులో పనిచేస్తున్న రవీందర్ ఢిల్లీలోని బ్యూరో ఆఫ్ స్టాండర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించే అడ్వాన్స్‌డ్ శాస్త్ర సాంకేతిక నైపుణ్యం సెమినార్‌లో కీమెంటర్‌గా ఎంపికవడంతో హెచ్‌ఎం ఐలయ్య, ఏఏపీ చైర్‌పర్సన్ సైదాబేగం, ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందించారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

కోహెడ జూన్ 21: కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన రెడ్డి సంఘం నాయకుడు ఎడబోయిన ప్రహ్లాద్‌రెడ్డి తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను శనివారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, పిల్లి సంపత్‌కుమార్ గౌడ్, చుక్క సురేశ్ తదితరులున్నారు.

## అక్రమ కేసులు పెట్టినా పోరాటం ఆగదు

చేర్యాల, జూన్ 21 : ప్రజాపాలన అంటూ ఊదరగొడుతున్న కాంగ్రెస్ సర్కారు పాలనలో అక్రమాలను నిలదీస్తే అక్రమ కేసులు బనాయిస్తున్నారని, ఎన్ని కేసులు పెట్టినా బీఆర్ఎస్ పోరాటం ఆగదని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్టును ఖండించారు. శంషాబాద్ విమానాశ్రయంలో హుజురాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి కేసులు బనాయించడం దుర్మార్గమైన చర్య అన్నారు. కౌశిక్‌రెడ్డిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని, కేసులు ఎత్తివేయాలన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా ప్రజల పక్షనా బీఆర్ఎస్ పోరాడుతుందని 'పల్లా' స్పష్టం చేశారు.

## ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలి



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ నిరేశ్

చేర్యాల, జూన్ 21: స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రజలు కలిసిమెలిసి ఉండాలని స్థానిక ఎస్ఐ నిరేశ్ కోరారు. శనివారం మండల పరిధిలోని దొమ్మాలను గ్రామ వీపీవో కలిసి ఆయన సందర్శించారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, సైబర్ నేరస్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# యోగా జీవితంలో భాగం కావాలి




సిద్దిపేటలో యోగాసనాలు వేస్తున్న కలెక్టర్,ఆదనపు కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరులు



ములుగు: అటవీ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, కళాశాల సిబ్బంది

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సిద్దిపేట జిల్లాలోని పలు మండలాలు, గ్రామాల్లో శనివారం యోగా డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ జీవితంలో యోగా సాధన భాగం చేసుకోవాలని కలెక్టర్ హైమావతి అన్నారు. మేధాశక్తికి యోగా సంజీవని లాంటిదని ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొండపాక జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్ నాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. యోగా ఆరోగ్య ప్రదాయిని అని సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి అన్నా రు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యం లో కోర్టు ఆవరణలో యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. న్యాయమూర్తి సాయిరమా దేవి, జడ్జి జయప్రసాద్‌లు మాట్లాడుతూ యోగా అందరి జీవితాల్లో భాగం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం యోగ గురువుల ను ఘనంగా సత్కరించారు. ములుగులోని అటవీ కళాశాల పరిశోధన కేంద్రంలో బోధన, భోదనేతర సిబ్బంది, విద్యార్థులతో కలిసి ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రైనర్స్ ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. కళాశాల విద్యార్థులు ఎండుటాకులతో యోగాసనాలు ప్రదర్శించారు. మద్దూరు మండలం లోని గాగిల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల లో హెచ్‌ఎం బైరగోని హరిప్రసాద్ ఆధ్వర్యం లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. సిద్ది పేట జిల్లా రాయప్రోలు మండలంలోని బేగం పేట ఉన్నత పాఠశాలలో, చిన్నకోడూరు మండలంలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో, ఇబ్రహీంనగర్ తెలంగాణ ఆదర్శ పాఠశాల కళాశాలలో యోగాసనాలు వేశారు.

– సిద్దిపేట/సిద్దిపేటటౌన్/కొండపాక/ములుగు/మద్దూరు(ధూళిమిట్ట)/చిన్నకోడూరు/రాయపోల్/హుస్నాబాద్/గజ్వేల్/జగదేవపూర్/కొమురవెల్లి/చేర్యాల/ మిరుదొడ్డి, జూన్ 21.



సిద్దిపేట టౌన్: యోగాసనాలు వేస్తున్న జడ్జిలు, న్యాయవాదులు



సిద్దిపేట టౌన్: ఆదర్శ పాఠశాల కళాశాలలో...



సిద్దిపేట: యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు



చేర్యాల: పెద్దచెరువు కట్ట వాకర్స్ అసోసియేషన్ సభ్యులు



గజ్వేల్‌లో ర్యాలీ తీస్తున్న సూర్య నమస్కార బృందం సభ్యులు



హుస్నాబాద్‌టౌన్: ధర్మవీర శిబిరంలో...




జగదేవ్‌పూర్: అలిరాజ్‌పేట పాఠశాలలో...

# జయశంకర్ సార్‌కు ఘన నివాళి



ధూళిమిట్టలో నివాళులర్పిస్తున్న నాయకులు

కోహెడ జూన్ 21: ప్రొఫెసర్ జయశంకర్‌సార్ 14వ వర్ధంతిని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నాయకుడు పిడిశెట్టి రాజు శనివారం కోహెడలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రైవేటు ఆసుపత్రిలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

ధూళిమిట్టలో..

ప్రొఫెసర్ జయశంకర్ సార్ వర్ధంతిని పురస్కరించుకొని నాయకులు శనివారం దూళిమిట్ట మండలకేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బామండ్లపల్లి కృష్ణ, ముంగి శ్రీనివాస్, దుబ్బుడు భూపాల్‌రెడ్డి, కనకరాములు, కొంగర రాజు, ఈశ్వర్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ వైద్యులను గుర్తించాం

- పోలీసులకు ఫిర్యాదు చేస్తాం
- మీడియా సమావేశంలో ఐఎంఏ అధ్యక్షుడు చందర్




సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

సిద్దిపేట టౌన్, జూన్ 21: ఫస్ట్ ఎయిడ్ సెంటర్లలో అర్హతకు మించి వైద్యం అందిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న నకిలీ వైద్యులను గుర్తించినట్లు సిద్దిపేట ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ చందర్ అన్నారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం సిద్దిపేటలో తనిఖీలు చేసి శుక్రవారం రాత్రి ఐఎంఏ వైద్యులు స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు చందర్ మాట్లాడుతూ.. మెడికల్ కౌన్సిల్ సభ్యులు 20 ఆసుపత్రుల్లో తనిఖీలు చేపట్టి నలుగురు నకిలీ వైద్యులను గుర్తించామన్నారు. వీరిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అనుమతులు తీసుకోని అర్హత గల వైద్యులు మాత్రమే ప్రజలకు వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సతీష్, శ్రీనివాస్, గణేష్, ప్రణీత్, భీమేష్, శ్రీనివాస్, శ్రవణ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణంతీసిన అతివేగం.. యువకుడి మృతి



మృతిచెందిన దుర్గాప్రసాద్

రాయపోల్, జూన్ 21: అతివేగం యువకుడి ప్రాణాలు తీసిన ఘటన రాయపోల్ మండలంలోని మంతూర్ గ్రామంలో చోటుచేసుకుంది. మండలకేంద్రానికి చెందిన కుంట దుర్గాప్రసాద్ (36) హైదరాబాద్‌లో క్యాబ్‌డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం రాయపోల్‌లోని తన తమ్ముడి ఇంట్లో జరిగిన శుభకార్యానికి వచ్చి శనివారం ఉదయం హైదరాబాద్ తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలో సిద్ధిపేట జిల్లా మంతూర్ గ్రామ సమీపంలో అతివేగంగా వెళ్తున్న కారు ఒక్కసారిగా అదుపు తప్పి రొడ్డు పక్కన చెట్టుకు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్ కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి చూడగా మృతిచెందినట్లు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు కుంట నాగరాజు ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్కుర్తి రఘుపతి తెలిపారు.

## ప్రజారోగ్యం కోసం ప్రత్యేక చర్యలు

చేర్యాల, జూన్ 21: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఐఎంఏ ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌కు అనుబంధంగా చేర్యాల డాక్టర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసినట్లు ఐఎంఏ చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళి మిట్ట మండలాల అధ్యక్షుడు డా.ఆర్.పరమేశ్వర్ తెలిపారు. ఐఎంఏ అనుబంధ చేర్యాల డాక్టర్స్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని అధ్యక్షుడిగా డా.రామగల్ల పరమేశ్వర్,ఉపాధ్యక్షుడిగా డా.సంతోష్‌కుమార్, ప్రధానకార్యదర్శిగా రఘునందన్‌రాణా, కోశాధికారిగా మంజుల ఎన్నికైనట్లు సభ్యులు తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శి మాకొద్దు

మిరుదొడ్డి, జూన్ 21: గ్రామంలోని సమస్యలు పరిష్కరించకుండా, అభివృద్ధికి సహకరించకుండా సొంత నిర్ణయాలతో ఇబ్బందుల పాలుచేస్తోందని ధర్మారం మాజీ ఎంపీటీసీ చెప్యాల శ్రీనివాస్ అన్నారు. శనివారం ధర్మారం పంచాతీయ కార్యదర్శి తులసిని విధుల నుంచి తొలగించాలనిఎంపీడీవో గంగుల గణేశ్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ ధర్మారం గ్రామంలో సమస్యలు పరిష్కరించకు ండా కొత్త సమస్యలకు పునాదులు వేస్తున్న కార్యదర్శిని మార్చి నూతన కార్యదర్శిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు మహేందర్, పర్శ రాములు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ



రాజును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి, జూన్ 21: మండలంలోని దాచారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు దీటి రాజు, జూనియర్ అసిస్టెంట్ కొలిపాక మంజుల ఇటీవల రోడ్డుప్రమాదంలో గాయపడగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శనివారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు కనగండ్ల తిరుపతి, కచ్చు రాజయ్య, చింతకింది శ్రీనివాస్‌గుప్తా, బోయినిపల్లి శ్రీనివాస్‌రావు, ముక్కీస తిరుపతిరెడ్డి, రాజు తదితరులున్నారు.

## మంత్రి వివేక్ వ్యాఖ్యలు పూర్తి అవాస్తవం

దుబ్బాక, జూన్ 21: దుబ్బాకలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి వివేక్ ప్రసంగం పూర్తిగా అవాస్తవమని దుబ్బాక ఏఎంసీ మాజీ చైర్మన్ చింతల జ్యోతి కృష్ణ ఆరోపించారు. అధికారిక కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రోటోకాల్ పాటించకపోవడం సిగ్గుచేటన్నారు. రైతులకు రుణమాఫీ, రైతుభరోసా అందించామని గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి యేడాదిన్నర గడుస్తున్నా 6 గ్యారెంటీలు ఇంకా అమలుచేయలేదన్నారు. రైతులను అన్ని రకాలుగా మోసగిస్తున్నారని, పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి సాగునీటి కష్టాలు తీర్చిన అపర భగీరథుడు కేసీఆర్ అన్నారు. నిరంతరం అభివృద్ధి కోసం తపిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కొందరూ కాంగ్రెస్ నాయకులు దిగజారుడు రాజకీయం చేయడం హేయమన్నారు.

## భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

బెజ్జంకి, జూన్ 21: మండలంలోని వడ్లూర్‌లో అంగన్‌వాడీ, తోటపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం, గాగిల్లాపూర్, మోడల్‌స్కూల్‌లో సైన్స్ ల్యాబ్‌లు, కేజీబీవీలో అదనపు గదులను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. అనంతరం పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీవో ప్రవీణ్, నాయకులు పాల్గొన్నారు.

## లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేయాలి

మిరుదొడ్డి, జూన్ 21 : అసంపూర్తిగా ఉన్న ఇర్కోడ్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను పూర్తిచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని జలసాధన సమితి నాయకులు అన్నారు. ఈ సందర్భంగా శనివారం తొగుట మండలం గుడికందుల గ్రామంలో ఘనపురం, గుడికందుల, వెంకటాపూర్, బుస్సాపూర్, వర్దరాజ్‌పల్లి, గోవర్ధన్‌గిరి, అందె, కొండాపూర్, పద్మనాభుని పల్లి, తిమ్మాపూర్, మర్రికుంట, పెద్దగుండవెల్లి గ్రామస్తులతో జలసాధన సమితి ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. నాయకులు మాట్లాడుతూ 50టీఎంసీల నీటి సామర్థ్యం మల్లన్న సాగర్ ప్రాజెక్టుకు ఉన్నప్పటికీ 12 గ్రామాల్లోని చెరువులు, కుంటల్లోకి నీళ్లు నింపడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న ఇర్కోడ్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను త్వరగా పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

మద్దూరు(ధూళిమిట్ట), జూన్ 21: ధూళిమిట్ట మండలంలోని బైరాన్‌పల్లిలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం సాయంత్రం దాడి చేశారు. బైరాన్‌పల్లి గ్రామ శివారులోని మన్నెం లింగారెడ్డి వ్యవసాయ బావి వద్ద ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ మద్దూరు పోలీసుల సహకారంతో పేకాట స్థావరం వద్దకు వెళ్లి గ్రామానికి చెందిన చింతల రమేశ్, బొల్లు మల్లయ్య, నందనబోయిన రాజు, మోటం నాగరాజును పట్టుకోగా ఆరెళ్ల సత్తయ్య అనే వ్యక్తి పరారయ్యాడు. పట్టుకున్న వారి నుంచి రూ.5,080 నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ మహబూబ్ తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరం సక్సెస్

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), జూన్ 21: అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలో శనివారం మల్లారెడ్డి దవాఖాన ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. కార్యక్రమంలో మోతె గ్రామ మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులు మానుకోవాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు కిరణ్

చేర్యాల, జూన్ 21 : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్ సర్కారు పోలీసులతో పెట్టిస్తున్న అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు బంగారిగళ్ల కిరణ్ డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ.. ఎంపీలు, ఎమ్మెల్యేల నుంచి జిల్లా,డివిజన్,మండల, గ్రామస్థాయి నాయకుల పై కాంగ్రెస్ సర్కారు కేసులు పెట్టడమే పనిగా పెట్టుకుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం మానుకొని కేసులు పెట్టించడం సరికాదన్నారు. హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు ఆకుల రాజేశ్‌గౌడ్, నాయకులు తాండ్ర సాగర్, తాండ్ర ఆంజనేయులు, బాచి, ఎర్రోల్ల యాదగిరి, ప్రవీణ్, కె.రవి తదితరులున్నారు.